సాక్షి
ఏలూరు

I

ఆదివారం । 21 । జనవరి । 2024

క్లుప్తంగా

జిల్లాలో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు



కేంద్ర కార్యదర్శి అహుజాకు పంటల సాగుపై వివరిస్తున్న కలెక్టర్

పెదవేగి: ఏలూరు జిల్లాలో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు జరుగుతున్నట్టు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ వ్యవసాయ, రైతు సంక్షేమ కేంద్ర కార్యదర్శి మనోజ్ అహుజాకు వివరించారు. వ్యవసాయ, పర్యవరణ అనుకూలమైన, అవసరమైన పంటల వైవిధ్యీకరణ ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా శనివారం కేంద్ర కార్యదర్శి మనోజ్ అహుజా, జాయింట్ సెక్రటరీ ఏకే సాహు, వ్యవసాయ కమిషనర్ పీకే సింగ్‌తో కూడిన కేంద్ర బృందం పెదవేగి (ఎన్ఆర్‌సీ) నేషనల్ ఆయిల్‌పామ్ రీసెర్చ్ సెంటర్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో పంటల సాగు ప్రగతిపై వివరించారు. ఆయిల్‌పామ్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన, పరిశోధనా క్షేత్రాలు, సాంకేతిక విషయాలు, పంటల సాగు, విస్తరణ, రైతుల పొలాల్లో సాగు వివరాలు, ప్రాసెసింగ్ సౌకర్యాలపై కేంద్రం బృందం అడిగి తెలుసుకుంది. కార్యక్రమంలో జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా సంస్థ డైరెక్టర్ డా.కె.సురేష్, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామ్మోహన్, పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. అనంతరం బృంద సభ్యులు ఆయిల్ పామ్ నర్సరీ, సీడ్ ల్యాబ్, సీడ్ గార్డెన్, మ్యూజియం, ల్యాబ్‌లు, ఆడమిల్లిలోని గోద్రెజ్ ఆగ్రో వెట్ లిమిటెడ్, ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు.

తీరు మార్చుకోకపోతే చర్యలు



కొయ్యలగూడెం పీహెచ్‌సీలో వైద్యురాలిని ప్రశ్నిస్తున్న డీఎంహెచ్‌ఓ

కొయ్యలగూడెం: ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ శర్మిష్ఠ హెచ్చరించారు. శనివారం కొయ్యలగూడెం పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులను, సిబ్బందిని ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీయడంతో పాటు రికార్డులను పరిశీలించారు. సేవలపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో డీఎంహెచ్‌ఓ హెచ్చరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఆస్పత్రిపై వచ్చిన పలు ఆరోపణలపై ఆమె విచారణ చేసినట్టు తెలిసింది. ముందుగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల కొయ్యలగూడెంలో ఏర్పాటుచేస్తున్న నేపథ్యంలో మూడు ప్రైవేటు హాస్పిటల్స్‌లో వసతులను పరిశీలించేందుకు ఆమె పర్యటించారు.

'ఓపెన్' ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు తేదీని పొడిగించినట్లు డీఈఓ పి.శ్యామ్ సుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకూ తత్కాల్ పద్ధతిలో రూ.1,000 అపరాధ రుసుం చెల్లించి ప్రవేశాలు పొందవచ్చన్నారు. వీరు వచ్చే జూన్, జూలైలో జరిగే పరీక్షలకు అర్హత పొందుతారన్నారు. ఫీజులను ఏపీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, సంబంధిత ఓపెన్ స్కూల్ అధీకృత స్టడీ సెంటర్ల ద్వారా, గ్రామ, వార్డు సచివాలయాం ద్వారా ప్రవేశాలు పొందవచ్చన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి



జాతీయ భద్రతా మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): రహదారి ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు విస్తృత అవగాహన కలిగించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం జాతీయ భద్రతా మాసోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రతపై సరైన అవగాహన లేనికారణంగా అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు విస్తృతమైన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏలూరు జిల్లాను రోడ్డు ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారించేందుకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి, ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసు, ఆర్‌టీఓ కె.శ్రీహరి, ఎంవీఐ జీ.ప్రసాదరావు, అసిస్టెంట్ ఎంవీఐలు బి.అజ్మీర్, జి.స్వామి, పి.నరేంద్రబాబు పాల్గొన్నారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీ ప్లేస్‌మెంట్స్‌లో మేటి

- గ్రామీణ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కొలువులు
- ప్రాంగణ ఎంపికల్లో 613 మంది విద్యార్థులకు ఉద్యోగాలు
- రూ.5 లక్షల నుంచి రూ.27.60 లక్షల ప్యాకేజీతో ఎంపికలు



నూజివీడు ట్రిపుల్ ఐటీలో అకడమిక్ భవనం

నూజివీడు: గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి సాంకేతిక విద్యను అందించేందుకు మహానేత వైఎస్సార్ ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఐటీల ఆశయం నెరవేరుతోంది. ఇక్కడ విద్యార్థులుగా చేర్చే తల్లిదండ్రులు కౌలు రైతులుగా, చిన్న, సన్నకారు రైతులుగా, కూలి పనులు, గుమస్తాలు వంటి చిరుద్యోగాలు చేసుకుంటూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివించుకున్న వారే. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీట్లు దక్కించుకుని ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసించి చదువు పూర్తవ్వగానే ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారు. 2017–23 బ్యాచ్ విద్యార్థులు 613 మంది పలు సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఈ ఏడాది 47 సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్లేస్‌మెంట్స్ నిర్వహించాయి. వీటిల్లో 12 కొత్త కంపెనీలు ఉన్నాయి. ఏడాదికి కనిష్టంగా రూ.5 లక్షల నుంచి గరిష్టంగా రూ.27.6 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. ట్రిపుల్ ఐటీలను స్థాపించి 15 ఏళ్లు పూర్తయింది. ఇందులో చదువుకున్న విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించడంతో వేలాది పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి.

ప్రత్యేక శిక్షణతో సిద్ధం చేస్తున్నాం



ట్రిపుల్ ఐటీలో చదివిన విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌లు వచ్చేలా కృషి చేస్తున్నాం. ఫిబ్రవరిలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, కోర్ కంపెనీల హెచ్ఆర్‌లతో సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. తృతీయ సంవత్సరం నుంచి విద్యార్థులకు శిక్షణనిస్తూ ప్లేస్‌మెంట్‌లకు సిద్ధం చేస్తున్నాం. మాక్ ఇంటర్వ్యూలు, ఆన్‌లైన్ టెస్టులు తరచూ నిర్వహిస్తున్నాం. ప్రముఖ కంపెనీలన్నీ క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఆచార్య ఎం.చంద్రశేఖర్, డైరెక్టర్, నూజివీడు ట్రిపుల్ ఐటీ

సీడీపీసీ నిరంతర కృషి : విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ కల్పించేందుకు ప్రత్యేకంగా కెరీర్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ సెల్ (సీడీపీసీ) ప్రత్యేకంగా కృషి చేస్తోంది. విద్యార్థులకు నిరంతరం మాక్‌టెస్టులు, మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించడంతో పాటు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలతో మాట్లాడి ప్లేస్‌మెంట్‌లు నిర్వహించేలా కృషి చేస్తోంది. టీసీఎస్, అన్‌లాగ్ డివైసెస్, డీజీకామ్, సినాప్‌సిస్, మాస్‌చిప్, ఫోర్స్‌సిస్, మాక్స్‌లీనీర్, టెస్ట్‌సిగ్మా, థాట్‌వర్క్స్, నెట్‌ఎన్‌రిచ్, రామ్‌కీ ఇన్‌ఫ్రా, డెక్కన్ కెమికల్స్, ఐటీసీ, వేదాంత తదితర అనేక కంపెనీలు ప్లేస్‌మెంట్స్ నిర్వహించాయి. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలైన ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, క్యాప్‌జెమినీ, విప్రో తదితర కంపెనీలు సైతం క్యాంపస్ సెలెక్షన్స్ నిర్వహించాయి.

కంపెనీలు.. ప్యాకేజీలు

ప్లేస్‌మెంట్ చేసిన కంపెనీలు ఏడాదికి రూ.5 లక్షల నుంచి రూ.27లక్షల వరకు వేతనాన్ని విద్యార్థులకు ఆఫర్ చేశాయి

- బెంగళూరుకు చెందిన అన్‌లాగ్ డివైసెస్ అత్యధిక ప్యాకేజీ రూ.27.6 లక్షలను ఈసీఈ విద్యార్థికి ఆఫర్ చేసి ఎంపిక చేసింది.
- బెంగళూరుకు చెందిన మరో కంపెనీ మాక్స్ లీనీర్ రూ.16 లక్షల వార్షిక వేతనంతో 8 మంది విద్యార్థులను ఎంపిక చేసుకుంది.
- బెంగళూరుకు చెందిన వేదాంత సాఫ్ట్‌వేర్ కంపెనీ రూ.15 లక్షల వార్షిక వేతనంతో ఏడుగురు విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసింది.
- హైదరాబాద్‌కు చెందిన థాట్ వర్క్స్ కంపెనీ ఏడాదికి రూ.11.10 లక్షల వేతనంతో 10 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసింది.

బ్రాంచ్ వారీగా ప్లేస్‌మెంట్స్ శాతాలు

ఈసీఈలో 76.80 శాతం, సీఎస్ఈలో 77.9 శాతం, కెమికల్ ఇంజినీరింగ్‌లో 51 శాతం, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 53 శాతం, సివిల్ ఇంజినీరింగ్‌లో 62 శాతం, ఎంఎంఈలో 67 శాతం విద్యార్థులు ప్లేస్‌మెంట్స్ సాధించారు. అయితే కెమికల్, మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు కోర్ గ్రూపునకు సంబంధించి ఉన్నత చదువులు చదివేందుకు ప్రాధాన్యతనివ్వడంతో కొంతమేర ఆయా గ్రూపుల్లో ప్లేస్‌మెంట్స్ తక్కువగా ఉన్నాయి.

ప్లేస్‌మెంట్స్ సాధించిన విద్యార్థుల వివరాలు

బ్రాంచ్	రిజిస్టర్డ్ విద్యార్థులు	ప్లేస్‌మెంట్స్ సాధించిన వారు
ఈసీఈ	220	169
సీఎస్ఈ	277	216
మెకానికల్	119	63
కెమికల్	53	27
సివిల్	166	103
ఎంఎంఈ	52	35
మొత్తం	887	613

పట్టిసంలో శివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు



పట్టిసంలో ఉత్సవ ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ సూర్యతేజ

పోలవరం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ అన్నారు. పోలవరం మండలం పట్టిసం రేవులో ఉత్సవ ఏర్పాట్లపై మొదటి దఫా సమావేశం శనివారం ఉత్సవ కమిటీ చైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ అద్దయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ మార్చి 8 మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు ఇసుక తిన్నెలపై జరిగే ఈ ఉత్సవాలకు 1.50 లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు. దేవస్థానం వద్ద భక్తులు ప్రశాంతంగా శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకుని వచ్చే విధంగా అన్ని సౌకర్యాలతో ఏర్పాట్లు తగిన సమయానికి పూర్తి చేయాలన్నారు.

ఇసుక తిన్నెలపై పందిళ్లు

ఇసుక తిన్నెలపై చలువ పందిళ్లు, పారిశుద్ధ్య పనులు, చేతి పంపుల ఏర్పాటు, ప్రథమ చికిత్స కేంద్రాలు, తాగునీరు వంటి వసతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని పీఓ సూర్యతేజ ఆదేశించారు. తొక్కిసలాటలు జరగకుండా ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్‌లు ఏర్పాటుచేయాలన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, మందులు, 108, 104 వాహనాలు అందుబాటులో ఉండాలన్నారు. నదికి ఇరువైపులా గజ ఈతగాళ్లు, పడవలు ఏర్పాటు చేసి నదిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. స్నాన ఘట్టాలకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు తగినన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

విద్యుత్ కొరత లేకుండా..

ఉత్సవాల సమయంలో విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలని విద్యుత్ శాఖాధికారులను పీఓ సూర్యతేజ ఆదేశించారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వారి వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు ప్రత్యేక స్థలాలు కేటాయించాలన్నారు. భక్తుల రద్దీని బట్టి ఆర్టీసీ బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారుల పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తిచేయాల్సి ఉందన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్తులు ఉత్సవాల సమయంలో అధికారులకు సహకరించి విజయవంతంగా పూర్తి చేయాలన్నారు.

పూర్తి బాధ్యతతో.. ఉత్సవ కమిటీ చైర్మన్, ఆర్డీఓ అద్దయ్య మాట్లాడుతూ ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పూర్తి బాధ్యతతో అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. నది దాటి వెళ్లేందుకు వీలుగా పంట్లు, భారీ కేడింగ్‌లు పటిష్టంగా చేయాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరింగ్ పనులు చేపట్టడంతో పాటు గోతులు పడిన ప్రదేశాల్లో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

దేవస్థానం అధికారులకు వినతి

ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో సరిపడా నిధులు లేవని, ఏటా ఖర్చులు పెరుగుతున్నాయని, ఉత్సవాలకు వచ్చే భక్తులకు చేసే ఏర్పాట్లలో ఇసుక తిన్నెల వైపు దేవస్థానం అధికారులు చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వచ్చే సమావేశం సమయంలో తెలియజేస్తామన్నారు. తహసీల్దార్ బి.సుమంతి, సీఐ జి.మధుబాబు, సర్పంచ్ సబ్బారపు శ్రీరామమూర్తి, ఎంపీడీఓ జి.శ్రీను, హుకుంపేట మీందార్ హోతా సీతా రామశాస్త్రి, దేవస్థానం ఈవో ఎస్.సంగమేశ్వర శర్మ, పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నా ఓటు.. నా బాధ్యత



సెల్ఫీ దిగిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో శనివారం ఏలూరు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన నా ఓటు–నా బాధ్యత అనే సెల్ఫీ బోర్డును కలెక్టర్ ఆవిష్కరించి సెల్ఫీ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నేను ఓటుహక్కు కలిగియున్నాను, నేను ఓటు వేస్తాను' నినాదంతో ఓటర్లంతా రానున్న ఎన్నికల్లో తమ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటు సామాన్యుల వజ్రాయుధమని రాజ్యాంగం కల్పించిన హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య మనుగడను కాపాడుకోవాలంటే ఓటుహక్కు ఒక్కటే మార్గమన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూడలేని కబోదులు

ఎమ్మెల్యే వాసుబాబు ధ్వజం



పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే, ఉంగుటూరు

గణపవరం: తన భవిష్యత్తుకే గ్యారెంటీలేని టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఎలా ఇస్తారని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో గ్రామగ్రామానా జరుతున్న అభివృద్ధిని కళ్లుండీ చూడలేని కబోదులు పచ్చపార్టీ నేతలు, పచ్చ మీడియా అని ఆయన అన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసలు రాష్ట్రంలో అభివృద్ధే లేదని ప్రతిపక్షాలు, పచ్చమీడియా రోజూ దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ప్రతి గ్రామంలో కనీసం రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఏ గ్రామంలో చూసినా సచివాలయ భవనాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ గ్రామ ఆరోగ్య కేంద్రాలు, జగనన్న కాలనీలు, రక్షిత మంచినీటి పథకాలు, మైక్రోఫిల్టర్ బెడ్స్, మనబడి నాడు–నేడు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు జరిగాయని, ఇవి అభివృద్ధి పనులు కావా అని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో వీటిలో ఏ ఒక్క కార్యక్రమాన్ని అయినా అమలు చేశారా అని నిలదీశారు. ఇవేమీ పట్టని పచ్చమీడియా నిస్సిగ్గుగా చంద్రబాబును గెలిపించాలని ప్రచారం చేస్తుందని, వీరి మాటలను ప్రజలు నమ్మడం ఎప్పుడో మానేశారన్నారు. కొత్తగా ఏర్పడిన మన రాష్ట్రంలో పరిస్థితులు అనుకున్నంత అనుకూలంగా లేక ఐటీ పరిశ్రమలో భారీ వృద్ధి నమోదు కావడం లేదని, అయినా ఐటీ పరిశ్రమ రావడం ఒక్కటే అభివృద్ధా అని ఆయన ప్రశ్నించారు.

సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధతో..

సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధతో ఐటీ రంగాన్ని మించి రాష్ట్రంలో మూడు పోర్టుల నిర్మాణం చేపట్టారని, వీటి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, ఇవి పూర్తయితే రాష్ట్రం రూపురేఖలే మారడంతో పాటు లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఎమ్మెల్యే వాసుబాబు అన్నారు. రూ.30 వేల కోట్లతో రెన్యూవబుల్ ప్రాజెక్ట్, రికార్డు స్థాయిలో ఒకేసారి 15 మెడికల్ కాలేజీల నిర్మాణం గురించి వీరు ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. అదే చంద్రబాబు హయాంలో గ్రాఫిక్స్‌లో చూపించిన అభివృద్ధిని పచ్చమీడియా నెత్తికెత్తుకుని ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో పచ్చపార్టీకి, పచ్చమీడియాకు అధికార దాహం ఎక్కువైందని, అందుకే ప్రభుత్వంపై విష ప్రచారాన్ని ముమ్మరం చేశాయని దుయ్యబట్టారు. వీరి గోబెల్స్ ప్రచారాన్ని కనీసం ఆ పార్టీ కార్యకర్తలే నమ్మడం లేదని, వచ్చే ఎన్నికలలో మళ్లీ భారీ మెజార్టీతో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ఎమ్మెల్యే వాసుబాబు ధీమా వ్యక్తం చేశారు.

మహిళలపై వివక్షను నిర్మూలించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మొదటి అదనపు జిల్లా జడ్జి రామగోపాల్

ఏలూరు (టూటౌన్): నేటి సమాజంలో స్త్రీలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతున్నా కొన్ని చోట్ల వివక్షతకు గురవుతున్నారని అటువంటి వివక్షతను నిర్మూలించడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా భవన్ నందు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, న్యాయవాదులు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బందికి 'పనిచేస్తున్న ఉద్యోగినులపైన జరుగుతున్న అత్యాచారాలను నిరోధించడం' అనే అంశంపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతి ఉద్యోగినికి తను పనిచేసే చోట అన్ని రకాల కనీస సౌకర్యాలు కల్పించాలని, అటువంటి బాధ్యతను సంబంధిత అధికారులు తీసుకోవాలని సూచించారు. మహిళలు వివక్షతకు గురైతే అధికారులకు ధైర్యంగా తెలియజేయాలని, తద్వారా ఇటువంటి చర్యలను నిర్మూలించవచ్చన్నారు. మహిళలకు ఉన్న హక్కులపై, చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ పోష్ యాక్ట్ కమిటీలను ఏర్పాటు చేయాలని, ఆ కమిటీల్లోని సభ్యుల పేర్లను విధిగా ప్రతి కార్యాలయంలో అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యులు కె.శ్రీనాగలక్ష్మి, బార్ అసోసియేషన్ కార్యదర్శి నోముల రాముడు, అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణులకు మరిన్ని అవకాశాలు కల్పించాలి



విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న లక్కోజు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో బీసీలకు పలు సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ఎస్ఎం పవిత్ర మురళీకృష్ణ శనివారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈకార్యక్రమానికి ఏలూరుకు చెందిన విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి ఆధ్వర్యంలో పలువురు విశ్వ బ్రాహ్మణులు తరలి వెళ్లారు. కార్పొరేషన్ ఎండీ కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ లక్కోజు రాజగోపాలచారి మాట్లాడుతూ అందరికీ అన్నీ ఇస్తున్న ముఖ్యమంత్రి తమ విశ్వ బ్రాహ్మణులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులను కేటాయించాలని కోరారు. గతంలో పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన ఎస్ఎం పవిత్రకు సముచిత స్థానం కల్పించడంపై ధన్యావాదాలు తెలిపారు. నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాలల్లో స్కూలు బోర్డులు, తలుపులు వంటి కార్పెంటరీ పనులను విశ్వబ్రాహ్మణులకు కేటాయించాలని, మంగళ సూత్రాలు స్వర్ణకారులకు కేటాయించాలని, స్వర్ణకారులు ఇబ్బంది పడుతున్న జీఓ నెం.272లో మార్పులు తీసుకురావాలని కోరారు. ఏలూరులో విశ్వ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారం అందజేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు చేవూరి రామస్వామి, 13 జిల్లాల డైరెక్టర్లు, బ్రహ్మంగారి మఠం నుంచి మఠాధిపతులు, పురోహిత, పండితులు, పెద్ద సంఖ్యలో విశ్వ బ్రాహ్మణులు హాజరైనట్లు కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలచారి తెలిపారు.

ఉపాధి యూనిట్ల స్థాపనకు కార్యాచరణ

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



సామాజిక సమత సంకల్పం పోటీల విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): స్వయం సహాయక సంఘాల్లోని గ్రూపులను చిన్న మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం మెప్మాకు సంబంధించిన స్లమ్ లెవెల్ ఫెడరేషన్, టీఎల్ఎఫ్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో సంఘ సభ్యులతో యూనిట్ల స్థాపన తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు నగరంలో ఉన్న రెండు టీఎల్ఎఫ్ గ్రూపులు ఒక్కో గ్రూపు కనీసం ఐదు చొప్పున ఉపాధి యూనిట్లు స్థాపించేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. నాలుగు నెలల కాలంలో ఆయా యూనిట్ల స్థాపనకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసుకొని తొలుత ఒక నెలలోపు యూనిట్ల స్థాపనకు అవసరమైన స్థల సేకరణ, మరో మూడు నెలల్లో యూనిట్లు గ్రౌండింగ్ చేయాలన్నారు. అలాగే టీఎల్ఎఫ్, ఎస్ఎల్ఎఫ్ సభ్యులకు ఆదాయం వచ్చే ఉపాధి యూనిట్లపై శిక్షణ అవగాహనను జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా నిర్వహించాలన్నారు. అవగాహన కార్యక్రమంలో ఆయా పరిశ్రమల జాబితా, వాటికి ప్రభుత్వం నుంచి అందే రాయితీల వివరాలు, యంత్ర పరికరాల లభ్యత, ముడిసరుకు లభ్యత తదితర అంశాలను తెలియజేయాలన్నారు.

మెప్మా ద్వారా రూ.225 కోట్ల రుణాలు

జిల్లాలో మెప్మా ద్వారా సుమారు రూ.225 కోట్ల రుణాలు అందించామని, ఆ సొమ్ముతో ఉపాధి యూనిట్ల నెలకొల్పే విషయంపై శ్రద్ధ పెడితే మరింత ఆర్థిక పురోగతి సాధించవచ్చని కలెక్టర్ అన్నారు. వ్యక్తిగత యూనిట్ల స్థాపన కన్నా గ్రూపు యూనిట్ల ఏర్పాటు మూలంగా బహుళ ప్రయోజనాలను పొందవచ్చన్నారు. అలాగే ఏలూరులో మహిళా మార్టు ఏర్పాటుకు తగిన ప్రతిపాదనలతో వస్తే అందుకు పూర్తి సహకారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలపై సభ్యులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఇటీవల సామాజిక సమత సంకల్పం కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మెప్మా పీడీ బి.ఇమ్మానియేల్, జిల్లా పరిశ్రమల కేంద్రం ఏడీ సుమధురవాణి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

సాక్షి ఏలూరు

ఆదివారం । 21 । జనవరి । 2024



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరు సత్రంపాడుకు చెందిన కందుల శ్రీలక్ష్మి రూ.2,00,116ను విరాళంగా అందజేశారు.



ముగ్గురు దొంగల అరెస్టు

ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.16 లక్షల విలువైన బంగారం, వెండి, ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸



ప్రకృతి వ్యవసాయం భేష్

రైతు సాధికార సంస్థ ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని తాము అనుసరిస్తామని బంగ్లాదేశ్ బృందం స్పష్టం చేసింది. 8లో ▸

న్యూస్‌రీల్

నవోదయ పరీక్షలకు 3,725 మంది హాజరు



కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ శ్యామ్‌సుందర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని నవోదయ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశాల నిమిత్తం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 3,725 మంది హాజరయ్యారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఈ పరీక్ష నిమిత్తం 24 కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలో 5,366 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1,641 మంది గైర్హాజరయ్యారు. రెండు కేంద్రాల్లో ఏలూరు డీఈఓ పి.శ్యామ్‌సుందర్, మరో రెండు కేంద్రాలను పశ్చిమగోదావరి డీఈఓ ఆర్‌వీ రమణ, పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చంద్రశేఖర్, పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎల్.శ్రీకాంత్ సందర్శించి పర్యవేక్షించారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, ప్రశాంతంగా జరిగాయని ఏలూరు డీఈఓ శ్యామ్ సుందర్ తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఏలూరులోని క్రాంతి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సమావేశం ప్రారంభమవుతుందని, ఎంపీ కోటగిరి శ్రీధర్, పార్టీ ఏలూరు పార్లమెంటరీ సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. సమావేశానికి జిల్లాలోని కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, మండల నాయకులు హాజరుకావాలని కోరారు.

రహదారి భద్రతా మాసోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లావ్యాప్తంగా శనివారం నుంచి రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉపరవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతితో రహదారి భద్రతపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించామని పేర్కొన్నారు. సోమవారం ఆర్టీసీ డ్రైవర్లకు ఏలూరు ఆర్టీసీ డిపో గ్యారేజీలో అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. వీటితో పాటు జిల్లావ్యాప్తంగా స్కూల్, కాలేజీ బస్సుల డ్రైవర్లకు, రవాణా వాహనాలు, ఆటో రిక్షా డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో పోలీస్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపల్, మెడికల్ అండ్ హెల్త్, నేషనల్ హైవేస్ శాఖల భాగస్వామ్యం కావాలని కోరారు.

స్వచ్ఛ గ్రామాలను తీర్చిదిద్దాలి

ఏలూరు(మెట్రో): డంపింగ్ యార్డ్‌లు అవసరం లేని స్వచ్ఛ గ్రామాలను తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. ఘన వ్యర్థాల నిర్వహణపై స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ అడ్వయిజర్, జిల్లా అధికారులతో కలిసి కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. జిల్లాలోని అన్ని గ్రామాలను చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు వినూత్న విధానంలో ఘన వ్యర్థాల నిర్వహణ చేపట్టాలన్నారు. నూతన విధానాన్ని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ వారు రూపొందించారని, ప్రారంభ దశలో జిల్లాలోని దెందులూరు, కైకలూరు, భీమడోలు, దొరమామిడి, మొర్సపూడి గ్రామ పంచాయతీల్లో చేపట్టనున్నామన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సలహాదారు వి.శ్రీనివాసన్, డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

బీసీలకు వైఎస్సార్‌సీపీ పెద్దపీట

- ఏలూరు ఎంపీ టికెట్ కేటాయింపుపై హర్షం
- బీసీ సంఘాల ఆనందోత్సాహాలు
- గెలిపించి కానుకగా ఇస్తామంటూ ప్రతిన
- మంత్రులు, ఎమ్మెల్యేలకు సంఘీభావం

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో బీసీ వర్గాలకు పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారంటూ బీసీ సంఘాల నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అన్నింటా బీసీలకు గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తున్నారంటూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు. వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ టికెట్‌ను బీసీలకు కేటాయించడం ద్వారా మరోమారు బడుగులకు పెద్దపీట వేశారని అంటున్నారు. గత పాలకులు బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటే సీఎం జగన్ ఇందుకు భిన్నంగా రాజ్యాధికారం అందించే దిశగా పనిచేస్తున్నారని కొనియాడుతున్నారు. రాష్ట్రంలో దాదాపు 60 శాతం మంది బీసీలు ఉన్నారని జనాభాకు తగ్గట్టుగానే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వివిధ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం తో పాటు నిధులను కేటాయించారని, నామినేటెడ్ పదవులతో పాటు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ స్థానాల్లో బీసీలను ముందు వరుసలో కూర్చోబెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా సమష్టిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గెలుపు కోసం పనిచేస్తాయని చెబుతున్నారు.



ఏలూరులో మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే ఆళ్ల నానికి సంఘీభావం తెలుపుతున్న బీసీ నాయకులు (ఫైల్)

చరిత్రలో తొలిసారిగా..

ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఎంపీ టికెట్‌ను బీసీలకు కేటాయించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని బీసీ సంఘాల నాయకులు చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఏలూరు ఎంపీ సీటుతో పాటు దీని పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి సీఎం జగన్‌కు కానుకగా అందిస్తామని అంటున్నారు. బీసీలకు పెద్దపీట వేస్తుండటంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీసీలకు అగ్రతాంబూలం



రాష్ట్రంలో బీసీలకు అన్నింటా అగ్రతాంబూలం ఇస్తున్న పార్టీ ఏదైనా ఉంది అంటే అది ఒక్క వైఎస్సార్ సీపీ మాత్రమే. మిగిలిన రాజకీయ పార్టీలు బీసీలను వాడుకుని వదిలేస్తున్నాయి. ఏలూరు ఎంపీ టికెట్‌ను బీసీలకు కేటాయించిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– లక్కోజు రాజగోపాలాచారి, అధ్యక్షుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం, ఏలూరు జిల్లా

చాలా సంతోషం



ఏలూరు ఎంపీ సీటును బీసీలకు కేటాయించడం చాలా సంతోషం. కొన్నేళ్లుగా ఏలూరు ఎంపీ స్థానాన్ని బీసీలకు కేటాయించాలని రాజకీయ పార్టీలను కోరుతున్నాం. వైఎస్సార్‌సీపీ సీటును కేటాయించడం గొప్ప విషయం. వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి గెలుపునకు సమష్టిగా పనిచేస్తాం.

– కాత్రు బాబు, ఏపీ యాదవ యువ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఏపీ రాష్ట్ర యువజన జేఏసీ కో–కన్వీనర్

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



బీసీలకు రాజ్యాధికారం అందించే దిశగా పనిచేస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. గత పాలకులకు భిన్నంగా బీసీలను అక్కున చేర్చుకుంటున్నారు. రాష్ట్రంలోని బీసీలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటారు. బీసీలకు అన్నింటా పెద్దపీట వేస్తున్నారు.

– కింజంగి రాజు, నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు, ఏలూరు

ఎన్నడూ లేనివిధంగా..



ఎన్నడూ లేనివిధంగా బీసీలకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ముఖ్యంగా బీసీల్లో అత్యధిక జనాభా ఉన్న యాదవులకు సీఎం జగన్ సముచిత స్థానం ఇస్తుండటం సంతోషం. ఏలూరు ఎంపీ సీటును అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం జగన్‌కు కానుకగా అందిస్తాం.

– చిదరబోయిన శ్రీనివాసరావు, అధ్యక్షుడు, అఖిల భారత యాదవ మహాసభ, ఏలూరు జిల్లా

‘విజయ కేతనం’ ఫలితం పదిలం

జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఇమిడి ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలో శనివారం విజయ కేతనం పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఉపయుక్తంగా ఈ పుస్తకం ఉంటుందన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ పుస్తకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో 85 శాతం ఉత్తీర్ణత నమోదుకావాలని, ఈ మేరకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ ఈ పుస్తకం ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. జెడ్పీ సీఈఓ, డీఈఓ, జెడ్పీ ఉప ముఖ్యకార్యనిర్వాహణ అధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీపీ భర్తకు మెరుగైన వైద్యం

- విజయవాడ నుంచి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- తక్షణమే స్పందించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పోడూరు: పోడూరు ఎంపీపీ సబ్బితి సుమంగళి భర్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సబ్బితి విద్యాసాగర్ విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గన్నవరం సమీపంలో ఆయన్ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయన తల వెనుక బలమైన గాయమైంది. విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు హుటాహుటిన ఆస్పత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందేలా డాక్టర్లను ఆదేశించి దగ్గరుండి పర్యవేక్షించారు. మెరుగైన వైద్యం కోసం శనివారం ఆయన్ను విజయవాడలో అను న్యూరో అండ్ కార్డియాక్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సీఎం జగన్ దృష్టికి.. విద్యాసాగర్ ప్రమాద వార్తను ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ఫోన్‌లో సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై సీఎం జగన్ అడిగి తెలుసుకున్నారు. విద్యాసాగర్‌కు మెరుగైన వైద్యం అందేలా చూడాలనీ సీఎం జగన్ సూచించారు. పోడూరు మండల జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఎంపీడీఓ డి.సుహాసిని, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు విజయవాడ వెళ్లి విద్యాసాగర్‌ను పరామర్శించారు.



విద్యాసాగర్‌ను విజయవాడలో ఆస్పత్రికి తరలిస్తున్న మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

నేడు ఏడీజే కోర్టు ప్రారంభం

తాడేపల్లిగూడెం: న్యాయసేవలు తాడేపల్లిగూడెం ప్రాంత ప్రజలకు మరింత చేరువ కానున్నాయి. జిల్లాలో కొత్తగా ఏడీజే కోర్టు ఆదివారం ఇక్కడ ప్రారంభం కానుంది. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 11వ ఏడీజే కోర్టుగా తాడేపల్లిగూడెంలో కోర్టును మంజూరు చేసింది. ఈ కోర్టు ఏర్పాటుతో ఎంబీఓపీ కేసులు, 302 ట్రయల్ కేసులు ఇక్కడే చేసుకోవచ్చు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఉన్న అపీల్స్ ఏడీజే కోర్టుకు వెళతాయని చెబుతున్నారు. తాడేపల్లిగూడెంకు సంబంధించి ఏలూరు జిల్లా కోర్టులో ప్రస్తుతం ఉన్న సుమారు 800 కేసులతో 200 కేసులు కొత్తగా ఏర్పాటుకాబోయే ఏడీజే కోర్టుకు బదిలీకానున్నాయని సమాచారం. రానున్న కాలంలో గూడెం సమీపంలోని కొన్ని ప్రాంతాలను ఈ కోర్టు పరిధిలోకి తీసుకొచ్చే అవకాశాలున్నాయి. తణుకు ఏడీజే కోర్టు న్యాయమూర్తి ఈ కోర్టుకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. హైకోర్టు జడ్జి బి.కృష్ణమోహన్, హైకోర్టు జడ్జిలు ఏవీ శేషసాయి, నయనాల జయసూర్య, బీఎస్ భానుమతి, సత్తి సుబ్బారెడ్డి, వి.గోపాలకృష్ణారావు ఆదివారం కోర్టు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు.

గ్రామ శివార్ల అభివృద్ధిపై దృష్టి

దెందులూరు: గ్రామ శివారు ప్రాంతాల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన పూర్తిస్థాయిలో జరిగితేనే గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య లక్ష్యం సాకారమవుతుందని, ఈ దిశగా కృషి చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నెల్లూరి శ్రీనివాసన్ అన్నారు. శనివారం డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, అధికారులతో కలిసి ఆయన దెందులూరులో పర్యటించారు. ప్రభుత్వ భవనాలు, డంపింగ్ యార్డు, పారిశుద్ధ్య పనులు, ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దెందులూరు, కైకలూరును పైలెట్ ప్రాజెక్టు గ్రామాలుగా ఎంపిక చేసిందని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, గ్రామ కార్యదర్శులు, డీఎల్‌పీఓలకు దశల వారీగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రయోగాత్మకంగా దెందులూరు, కైకలూరు గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ లక్ష్యాల సాధనకు అన్ని చర్యలు తీసుకుని చేస్తున్న కృషికి ఉద్యోగులు సహాయ, సహకారాలు అందించాలన్నారు. దెందులూరు ఎంపీడీఓ శ్రీలత, గ్రామ కార్యదర్శి వీఎస్ చౌదరి, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసన్

పల్లెపల్లెనా అభివృద్ధి కాంతులు

ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: సీఎం జగన్ సారథ్యంలో పల్లెపల్లెనా విశాల సౌధాల కార్యాలయాలు, రాజమార్గాలు, ఇంటింటా కుళాయిలు, అంతిమ సంస్కారాల మరుభూములతో కాంతులు విరజిమ్ముతున్నాయని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. శనివారం మండలంలో ఐదు గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు వీరు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాట్రేనిపాడులో రూ.40 లక్షల నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.133.20 లక్షలతో నిర్మించ తలపెట్టిన 60 వేల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్, 300 కుళాయిలు, 10 కిలోమీటర్ల పొడవున పైపులైన్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. గోపవరం, పెదపాటివారిగూడెం పంచాయతీల్లో వీధి దీపాలను ప్రారంభించారు. యల్లాపురంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, రూ.35.90 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టిన పైప్‌లైన్, కుళాయి పనులకు శంకుస్థాపన చేశారు. లోపూడిలో రూ.33 లక్షలతో నిర్మితమైన ఓవర్ హెడ్ ట్యాంక్, పైపులైన్, కుళాయిలను ప్రారంభించారు. అలాగే సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాలు, శ్మశాన వాటిక, డిజిటల్ లైబ్రరీలను ప్రారంభించారు. రమణక్కపేటలో అభివృద్ధి చేసిన శ్మశాన వాటికను ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మేకా అప్పారావు మాట్లాడుతూ జగనన్న పాలనలో పల్లెలు సర్వాంగ సుందరంగా మారాయన్నారు. ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ అన్నివర్గాలకు సంక్షేమాన్ని అందించిన వైఎస్సార్ సీపీకి మాత్రమే ఓటు అడిగే అర్హత ఉందన్నారు. సచివాలయ స్థల దాతలు కంబాల ఏసురత్నం, గండేపూడి చిట్టియ్య కుటుంబసభ్యులను సన్మానించారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీడీఓ జి.రాణి, సర్పంచ్‌లు సుహాసిని, వాణి, కృష్ణ, రంగు ధనలక్ష్మి, ఏట మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, చిత్రంలో ఎంపీ కోటగిరి శ్రీధర్

ఆఫ్‌లైన్‌లోనూ టికెట్ల విక్రయం



టికెట్ అందిస్తున్న సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల క్షేత్రంలో ఆఫ్‌లైన్‌లో శ్రీవారి నిత్యార్జిత కల్యాణం, అష్టోత్తర సేవా టికెట్ల విక్రయాలను శనివారం ప్రారంభించారు. ఆలయంలో ఇటీవల అన్ని సేవలతో పాటు నిత్యార్జిత కల్యాణం, అష్టోత్తర సేవా టికెట్ల విక్రయాలను ఆన్‌లైన్‌కు పరిమితం చేశారు. ఈ క్రమంలో నిత్య కల్యాణ మండపం వద్ద ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందేందుకు కియోస్క్ మెషీన్లను ఏర్పాటుచేశాయి. అయితే కొందరు భక్తులకు ఆన్‌లైన్ వినియోగంపై అవగాహన లేక ఇబ్బంది పడుతున్నారు. దీనిని గుర్తించిన అధికారులు ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయాలను ప్రారంభించారు. అలాగే ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందడంపై అవగాహన కల్పించేలా బోర్డు ఏర్పాటుచేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ శ్రేణులు



టీడీపీ శ్రేణులను పార్టీలో చేర్చుకుంటున్న ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ముసునూరు: జగనన్న నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరిన వారు పార్టీ అభివృద్ధి, పురోగతి కోసం క్రమశిక్షణతో పనిచేయాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. రమణక్కపేట గ్రామంలోని 12 కుటుంబాలకు చెందిన 48 మంది టీడీపీ గ్రామ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం పార్టీలో చేరారు. వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ టీడీపీ గ్రామ కార్యదర్శి పొలడుగు సుబ్బాచారి, ఆముదాల మరియన్న, పుష్పలత, నందిపాము రాణి, దారా బేబిషాలిని తదితరులకు ఎంపీ, ఎమ్మెల్యే కండువాలు వేసి ఆహ్వానించారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, మాజీ ఎంపీపీ కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ రంగు ధనలక్ష్మీ గాంధీ, ఉప సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయం భేష్



మాట్లాడుతున్న బంగ్లాదేశ్ బృందం

చాట్రాయి: రైతు సాధికార సంస్థ ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని తాము అనుసరిస్తామని బంగ్లాదేశ్ పల్లికర్మ సహాయ ఫౌండేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ అకోండ్ మహ్మద్ రఫీకుల్ ఇస్లాం స్పష్టం చేశారు. శనివారం జనార్దనవరంలో వ్యవసాయ హెల్త్ క్లబ్ కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహారం, ఆహార భద్రత, మహిళా రైతు సాధికారత ప్రపంచానికే ఆదర్శకంగా నిలుస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం అమలులో ప్రధాన పాత్ర పోషిస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు భవిష్యత్ ప్రణాళిక కూడా అద్భుతమని కొనియాడారు. మహిళా రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రసాయనాలు లేకుండా పండించిన పంటలతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నామని ఆదాయాన్ని పెంపొందించుకుంటున్నామని గ్రామ కమిటీ సభ్యులు బంగ్లాదేశ్ బృందానికి వివరించారు. మిచాంగ్ తుపాను తాకిడికి ఈ పంటలు తట్టుకున్నాయని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ బృందానికి వివరించారు. ప్రకృతి వ్యవసాయ పంటల ఛాయా చిత్రాలను బృందం తిలకించింది. మాజీ సర్పంచ్ పామర్తి నాగేశ్వరరావు, బంగ్లాదేశ్ బృందం సభ్యులు తాఫిక్ హుస్సేన్, సంసాద్ ఫర్హానా, రైతు సాధికార సంస్థ థిమాటిక్ లీడ్‌లు అరుణ, శ్రీరాము ఏలూరి, సురేష్, ఆరోగ్య విభాగం పీడీ డాక్టర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ నేరాలపై ఉక్కుపాదం



పట్టుకున్న సారా తయారీ పనిముట్లతో ఎస్ఈబీ సిబ్బంది



నాగిరెడ్డిగూడెంలో సారా బట్టీలను పరిశీలిస్తున్న ఎస్ఈబీ అధికారులు (ఫైల్)

- సారా, మద్యం అక్రమ రవాణా కట్టడికి కఠిన చర్యలు
- గత ఏడాది సర్కిల్ పరిధిలో 414 కేసుల నమోదు
- 442 మంది అరెస్ట్.. తెలంగాణ మద్యంపై నిఘా

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో సారా, మద్యం నియంత్రణ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి మద్యం అక్రమ రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. మద్యం అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. అలాగే సారా తయారీ కేంద్రాలను గుర్తించి ప్రతి రోజూ దాడులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆకస్మిక దాడులు చేస్తున్నారు. మద్యం రవాణా, అనధికార విక్రయాల నియంత్రణకు ప్రభుత్వం 2020 మేలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను అమల్లోకి తీసుకు వచ్చింది. కఠిన చట్టాలను రూపొందించి పోలీస్, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో విస్తృత దాడులు నిర్వహిస్తున్నారు. అలాగే మరింత కట్టడి కోసం పరివర్తన కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అవగాహనా సదస్సులను నిర్వహిస్తూ మద్యం, సారా వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తున్నారు. గత ఏడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు చింతలపూడి సర్కిల్ పరిధిలో 414 కేసులు నమోదు చేసి 442 మందిని అరెస్ట్ చేసి 51 వాహనాలను నుంచి స్వాధీనం చేసుకున్నారు. 2,525 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 52,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే 780 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ నుంచి అక్రమంగా తరలిస్తున్న 200 లీటర్ల మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై పీడీ యాక్ట్ అమలు చేశారు. అదేవిధంగా 517 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ నిందితులపై ఎక్సైజ్ ఎమెండ్‌మెంట్ యాక్ట్ 2020 కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

కఠిన చర్యలు తీసుకుంటున్నాం



మద్యం అక్రమ రవాణాపై కఠిన చట్టాలు అమల్లోకి వచ్చాయి. మద్యం, సారా కేసుల్లో పట్టుబడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తున్నాం. పట్టుబడిన నిందితుడికి కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2 లక్షల వరకు జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయి. సారా, మద్యం అక్రమ విక్రయాలను విడనాడాలి.

– సుంకర సాయి స్వరూప్, సీఐ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్

ముగ్గురు దొంగల అరెస్టు

- 19 కేసుల్లో నిందితులుగా గుర్తింపు
- 30 కాసుల బంగారం, 3 కేజీల వెండి స్వాధీనం
- డీఎస్పీ రవి మనోహరాచారి వెల్లడి

పాలకొల్లు సెంట్రల్: పట్టణ శివారులో వాహనాల తనిఖీ సందర్భంగా పారిపోతున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.16 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నట్లు నరసాపురం డీఎస్పీ కె.రవి మనోహరాచారి చెప్పారు. పట్టణ పోలీస్‌స్టేషన్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. శుక్రవారం పాలకొల్లు, భీమవరం రోడ్డు పూలపల్లి వై.జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా ఒక బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వస్తూ పోలీసులను చూసి వెనక్కి పారిపోతుండగా పట్టణ ఎస్సైలు ఎస్.ముత్యాలరావు, బి.శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వారిని పట్టుకుని విచారణ చేశారు. దీనిలో పూలపల్లి ఎస్.టర్నింగ్ వద్ద ఉన్న హోటల్‌లో దొంగతనం చేశామని, అలాగే జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ఇళ్లల్లో దొంగతనాలు, మోటర్ సైకిల్ దొంగిలించినట్లు తెలిందన్నారు. దొంగిలించిన బంగారం, వెండి భీమవరంలో విక్రయించడానికి తీసుకువెళుతూ పట్టుబడ్డారన్నారు. నిందితులు రాజమహేంద్రవరానికి చెందిన జి.సతీష్‌కుమార్, నరసాపురానికి చెందిన ఎం.నాగభాస్కరరావు, కె.నరేష్‌లపై కేసు నమోదు చేసి వారి నుంచి 30 కాసులు బంగారపు వస్తువులు, 3 కేజీల వెండి, ఒక మోటర్ వెహికల్ స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ సుమారు రూ.16 లక్షలు ఉంటుందన్నారు. పాలకొల్లు పట్టణం, రూరల్, పోడూరు, యలమంచిలి, వీరవాసరం, పాలకోడేరు, నరసాపురం పట్టణం, రూరల్, మొగల్తూరు స్టేషన్ల పరిధిలో 19 కేసుల్లో దొంగతనం కేసుల్లో వీరు నిందితులన్నారు. ఇవి కాక వివిధ పోలీస్‌స్టేషన్లలో సతీష్‌పై 32 కేసులు, భాస్కర్‌పై 32 కేసులు, నరేష్‌పై 14 చోరీ కేసులు ఉన్నాయన్నారు. సీఐ దారావత్తు రాంబాబు ఆధ్వర్యంలో చోరీ సొత్తు రికవరీ చేయడంలో ఎస్సైలతో పాటు కానిస్టేబుల్స్‌ను డీఎస్పీ అభినందించారు.

ఐటీడీఏలో గ్రూప్-2 పరీక్షలకు ఉచిత శిక్షణ

బుట్టాయగూడెం: గ్రూప్-2 పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న గిరిజన యువతీ యువకులకు కేఆర్‌పురం ఐటీడీఏ వైటీసీలో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-2 నోటిఫికేషన్ ద్వారా 897 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల నియామకానికి ప్రకటన వెలువడిన నేపథ్యంలో పరీక్షలకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేయాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోగా గ్రూప్-2 పరీక్షలకు రిజిస్ట్రేషన్ చేసిన స్లిప్, అలాగే ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, దరఖాస్తు ఫారమ్‌ను వైటీసీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 9490285277 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వాట్సాప్ ద్వారా అసభ్యకర వీడియోలు, చాట్‌ల ద్వారా మహిళలను వేధిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ బి.విద్య శనివారం చెప్పారు. జంగారెడ్డిగూడెంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగినికి ఈనెల 17న 9434232160 నంబర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, సహచర ఉద్యోగినుల ఫోన్ నంబర్లు ఇవ్వాలని అడిగాడు. అప్పటి నుంచి ఆమెతోపాటు తోటి ఉద్యోగినుల వాట్సాప్‌కు అసభ్యకరమైన వీడియోలు, చాట్‌లు వస్తున్నాయని, అలాగే 9963759410 నంబర్ నుంచి తరచుగా మిస్డ్ కాల్స్ వస్తున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉద్యోగిని ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లిలో బట్టలు ఉతికేందుకు వెళ్లి చెరువులో నీటమునిగి ఓ వృద్ధురాలు మృతి చెందింది. జరిగింది. వివరాలిలా ఉన్నాయి. అంబేడ్కర్ కాలనీకి చెందిన కటికల సరోజిని (70) అనే వృద్ధురాలు శనివారం ఉదయం పెదరామాలయం వద్ద ఊరచెరువు మెట్ల రేవు వద్ద బట్టలు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో మునిగి మృతి చెందింది. స్థానికుల సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు చెరువులోని మృతదేహాన్ని బయటకు తీశారు.